క్లుప్తంగా

డబ్బాలో దొంగతనం

ఐనవోలు : రెగ్జిన్, అద్దాలు, సీటు కవర్లు విక్రయించే డబ్బాలో దొంగతనం జరిగింది. ఈ సంఘటన మండలంలోని పంథిని గ్రామంలో చోటుచేసుకుంది. ఎస్సై శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం.. పున్నేలు గ్రామానికి చెందిన రేపెల్లి సుమన్ పంథిని గ్రామ శివారులో రెగ్జిన్, అద్దాలు, సీటు కవర్లు విక్రయిస్తూ జీవనం కొనసాగిస్తున్నాడు. రాత్రి వాటిని అక్కడే ఓ డబ్బాలో ఉంచి శనివారం ఉదయం డబ్బా వద్దకు వెళ్లిచూశాడు. గుర్తుతెలియని వ్యక్తులు తాళం ధ్వంసం చేసి అందులో గల సుమారు రూ.30 వేల విలువచేసే వస్తువులను దొంగిలించినట్లు బాధితుడు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పస్తం శ్రీనివాస్ పేర్కొన్నారు.

తిరుమలలో అఖండ హరినామ సంకీర్తన



శాయంపేట : మండలంలోని పత్తిపాక గ్రామంలో గల శ్రీరామదాసు భజన మండలి సభ్యులు ఆదివారం తిరుమల తిరుపతి దేవస్థానంలో టీటీడీ ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రోగ్రాం నిర్వాహణ అధికారి శ్రీరాంరెడ్డి కృష్ణమూర్తి సారథ్యంతో, హిందుధర్మ ప్రచార పరిషత్, సిద్ధేశ్వరస్వామి ఆధ్వర్యంలో అఖండ హరినామ సంకీర్తన చేపట్టారు. కార్యక్రమంలో శ్రీరామదాసు భజన మండలి హనుమకొండ జిల్లా అధ్యక్షుడు మాందాడి రాజు, వరంగల్ జిల్లా అధ్యక్షుడు అశోక్‌కుమార్, సభ్యులు సంతోశ్‌బాబు, సృజన, సంధ్య, పద్మ, అరుణదేవి, సుమతి, సుకన్య, రాజశ్రీ, అనురాధ, స్పందన, సాయిరవళి, స్నేహ, వేణుగోపాల్, చంద్రకుమార్, లక్ష్మణ్, సదానందం, రాజు పాల్గొన్నారు.

డాక్టరేట్

నర్సంపేట రూరల్ : నర్సంపేట మండలంలోని భాంజీపేటకు చెందిన కట్ల రాజేందర్‌కు కాకతీయ విశ్వవిద్యాలయ పరీక్షల నియంత్రణాధికారి డాక్టరేట్ ప్రకటించారు. రాజేందర్ 'మెకానికల్ క్యారెక్టరైజేషన్ అండ్ అప్టిమైజేషన్ ఆఫ్ మెటల్ మ్యాట్రిక్–కాంపోజిట్స్' అంశంపై ప్రొఫెసర్ ఈశ్వరయ్య సారథ్యంలో డిపార్ట్‌మెంట్ ఆఫ్ మెకానికల్ ఇంజనీరింగ్‌లో పీహెచ్‌డీని పూర్తి చేశారు. ఈ క్రమంలోనే వర్సిటీ నుంచి ఆయన డాక్టరేట్ పట్టా పొందారు.

నేడు కలెక్టరేట్ ఎదుట ధర్నా

వర్ధన్నపేట : సివిల్ సప్లయీస్ హమాలీ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం నేడు (సోమవారం) కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహిస్తామని సంఘం జిల్లా అధ్యక్షుడు జలగం భిక్షపతి తెలిపారు. పట్టణంలోని ఎంఎల్ఎస్ పాయింట్ వద్ద సివిల్ సప్లయీస్ హమాలీలు చేపట్టిన సమ్మె ఆదివారం ఐదో రోజుకు చేరుకోగా భిక్షపతి హాజరై మాట్లాడారు. సమస్యల పరిష్కారం కోసం ఐదు రోజులుగా సమ్మె చేస్తున్నా ప్రభుత్వం స్పందించకపోవడం సరికాదన్నారు. కలెక్టరేట్ ఎదుట తలపెట్టిన ధర్నాకు హమాలీ కార్మికులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు మోహన్, శ్రీనివాస్, రవి, సామేల్, భుజంగం తదితరులు పాల్గొన్నారు.

ఎన్ఎస్ఎస్ సేవలు

పర్వతగిరి : మండలంలోని కల్లెడలో కాజీపేట నిట్ ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో విద్యార్థులు ఆదివారం సేవా కార్యక్రమం నిర్వహించారు. ఎన్ఎస్ఎస్ జనరల్ సెక్రటరీలు అభినవ్, మానస, దివ్య పర్యవేక్షణలో విద్య, ఆరోగ్యంపై అవగాహన పెంపొందించారు. బాలికల విద్య, శక్తివంతమైన అభ్యాసంపై శిక్షణ ఇచ్చారు. వైద్యులతో వైద్యశిబిరం ఏర్పాటు చేసి గ్రామస్తులకు ఆరోగ్య పరీక్షలు చేయించారు. అనంతరం ఆర్డీఎఫ్ కళాశాలలో ప్రిన్సిపాల్ జనార్దన్ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో వైద్యపరీక్షలు చేయించారు. తదనంతరం గ్రామంలో ర్యాలీ నిర్వహించారు.

ఆర్థికసాయం

రాయపర్తి : మండలంలోని కొండూరుకు చెందిన కర్ర రాజిరెడ్డి ఇటీవల మృతి చెందగా అతడి కుటుంబాన్ని అతడితో కలిసి 1998–99 విద్యాసంవత్సరంలో పదో తరగతి చదువుకున్న స్నేహితులు ఆదివారం రూ.50 వేల సాయం అందజేశారు. తొలుత రాజిరెడ్డి చిత్రపటానికి అతడి స్నేహితులు నివాళులర్పించారు. అనంతరం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. కార్యక్రమంలో రాజిరెడ్డి స్నేహితులు పూస మధు, అడ్లూరి ప్రవీణ్, నిమ్మల కుమార్, రాయిని సంతోశ్, పులి అంజయ్య, కర్ర ప్రవీణ్‌రెడ్డి, యాకయ్య, కొమ్ము రాజు, ఉబ్బని నర్సింగం, కరుణాకర్, పంతంగి యాకయ్య, పూస ప్రభాకర్, కురుపాద్దీన్, గజవెల్లి వేణు, గుంటుక పెద్ద యాకయ్య, నాగరాణి, వెంకటేశ్వర్లు, పూస కృష్ణ, స్వరూప, విజయ, నజీర్ పాషా, చిదురాల సంధ్య, శేఖర్, మచ్చ రేణుక, కొమ్ము యాకయ్య, ముస్తఫా తదితరులు పాల్గొన్నారు.

పాతముగ్దుంపురంలో..

చెన్నారావుపేట : మండలంలోని పాత మగ్దుంపురం గ్రామానికి చెందిన కొండపర్తి కృష్ణమోహన్ రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతుండగా ఆయనకు వైద్యం కోసం అతడి స్నేహితులు ఆదివారం రూ.40 వేల సాయం అందజేశారు. తొలుత కృష్ణమోహన్‌తో కలిసి 2008లో బీఈడీ చదువుకున్న మిత్రులు నూనె రాములు, సతీశ్ ఉన్నారు.

కాల్వలు ఇలా.. నీళ్లు పారేదెలా..?



కమలాపూర్ శివారులో ధ్వంసమైన కాల్వ



కానిపర్తి శివారులో దెబ్బతిన్న 4ఆర్ ఉపకాల్వ

- పలు చోట్ల ధ్వంసమైన కాల్వలు
- కొన్నేళ్లుగా కానరాని మరమ్మతులు
- చివరి ఆయకట్టుకు అందని సాగు నీరు
- పట్టించుకోని అధికారులు

కమలాపూర్ : మండలంలో ఎస్సారెస్పీ కాల్వ పరిస్థితి అధ్వానంగా తయారైంది. వాటి నిర్వహణలో అధికారుల నిర్లక్ష్యం రైతుల పాలిట శాపంగా మారుతోంది. మండల వ్యాప్తంగా డీబీఎం 18, 20, 21, 22, 22ఏ, 24 కాల్వలు, వాటికి అనుబంధంగా ఉన్న ఉపకాల్వ కింద సుమారు 26 వేల వరకు ఆయకట్టు ఉండగా కేవలం కాల్వ నీటిపైనే ఆధారపడి సుమారు 12 వేలకు పైచిలుకు ఎకరాల్లో రైతులు పంటలు సాగు చేస్తున్నారు. ప్రస్తుతం ఎక్కడ చూసినా కాల్వలన్నీ పగుళ్లతో దర్శనమిస్తుండగా, పలు చోట్ల ధ్వంసమై గండ్లు పడటంతో పాటు చెట్లు, ముళ్ల పొదలతో నిండిపోయాయి. దీనికితోడు ఎగువన ఉన్న రైతులు నీళ్ల కోసం కాల్వకు గండ్లు పెట్టి, పైపులు వేసుకుని నీళ్లు పారించుకుంటున్నారు. దీంతో దిగువన ఉన్న రైతులకు నీళ్లందని దుస్థితి నెలకొంది. పాలకులు, అధికారులు కాల్వల మరమ్మతులపై దృష్టి సారించకపోవడంతో ఈ యాసంగి పంట సాగు కోసం ఎస్సారెస్పీ నీటిని విడుదల చేసినప్పటికీ చివరి ఆయకట్టు భూములకు సాగు నీరందడం లేదని రైతులు వాపోతున్నారు. మండలంలోని గోపాల్‌పూర్‌కు కొన్నేళ్లుగా ఎస్సారెస్పీ కాల్వ నీళ్లు రావడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పాలకులు, అధికారులు స్పందించి కాల్వకు మరమ్మతులు చేపట్టడంతో పాటు నిరంతరం పర్యవేక్షించి చివరి ఆయకట్టు భూములకు సాగు నీరు అందేలా చూడాలని రైతులు కోరుతున్నారు. ప్రభుత్వం, అధికారులు దృష్టిసారించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

కాల్వ నీళ్లు వచ్చిన దాఖలాలు లేవు



కాల్వ కట్టినప్పటి నుంచి మూడు, నాలుగుసార్లు తప్పా గోపాల్‌పూర్‌కు కాల్వ నీళ్లు వచ్చిన దాఖలాలు లేవు. చివరి ఆయకట్టుకు నీళ్లు అందక రైతులు తమ పంటలను కాపాడుకునేందుకు ఇతర రైతుల వ్యవసాయ బావుల నుంచి నీళ్లు కొనుక్కోవాల్సి వస్తోంది. చివరి ఆయకట్టుకు సాగు నీళ్లందేలా చూడాలి.

– లదె గోపాల్, మాజీ సర్పంచ్, గోపాల్‌పూర్

మరమ్మతులు చేపట్టాలి



డీబీఎం–24 కాల్వ పూర్తిగా దెబ్బతిని చెట్లు, ముళ్ల పొదలతో నిండిపోయింది. దీనికితోడు ఎగువన ఉన్న రైతులు నీళ్ల కోసం కాల్వకు గండ్లు పెట్టి పైపులు వేసుకుని నీళ్లు పారిస్తున్నారు. గతేడాది కాల్వ ద్వారా నీళ్లందక పంటలు ఎండిపోయాయి. ఈ సారైనా కాల్వకు మరమ్మతులు చేపట్టి మాకు నీళ్లు అందేలా చూడాలి.

– మంద రఘుపతి, మాదన్నపేట

అద్దె భారం తగ్గేనా..?

కిరాయి భవనాల్లో రిజిస్ట్రేషన్ కార్యాలయాలు

- 13 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు 8 అద్దె భవనాల్లోనే..
- రూ.లక్షల్లో పేరుకుపోయిన బకాయిలు
- మంత్రి ప్రకటనతో చిగురించిన ఆశలు..

కాజీపేట అర్బన్: ప్రభుత్వ ఖజానాకు ఆదాయం సమకూర్చుతున్న రిజిస్ట్రేషన్ కార్యాలయాలు మాత్రం అద్దె భవనాలు, అరకొర సౌకర్యాల మధ్య కొనసాగుతున్నాయి. ఉమ్మడి వరంగల్ జిల్లాలో 13 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు, డీఐజీ కార్యాలయం ఉండగా.. ఎనిమిది కార్యాలయాలు అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయి. దీంతో ప్రతి నెలా ప్రభుత్వం రూ.1,88,852 అద్దె చెల్లిస్తున్నది.

సాకారం కానున్న శాశ్వత భవనాలు

రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ఇటీవల రిజిస్ట్రేషన్ శాఖ అధికారులతో సమావేశం ఏర్పాటు చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా అద్దె భవనాల్లో కొనసాగుతున్న సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల అద్దె బకాయిలు రెండేళ్లుగా పేరుకుపోయాయని పేర్కొన్నారు. వాటికి శాశ్వత భవనాలకు శ్రీకారం చుడతామని ప్రకటించారు. దీంతో ఉమ్మడి వరంగల్ జిల్లాలో అద్దె భవనాల్లో కొనసాగుతున్న డీఐజీతోపాటు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు శాశ్వత భవనాలు సాకారం అవుతాయనే ఆశలు చిగురించాయి. దీంతో ఖజానాకు అద్దె భారం తగ్గే అవకాశం ఉంది.

గతేడాది మార్చిలోనే కలెక్టర్‌కు వినతి..

గతేడాది మార్చి నెలలో నాటి జిల్లా రిజిస్ట్రార్.. సబ్ రిజిస్ట్రార్లతో సమావేశం నిర్వహించి శాశ్వత కార్యాలయాలకు స్థలాల సేకరణ నిమిత్తం అప్పటి కలెక్టర్‌కు వినతులు అందజేశారు. అయితే, ఆ దిశగా ప్రభుత్వం అడుగులు వేయలేదు. తాజాగా రెవెన్యూ శాఖ మంత్రి శాశ్వత భవనాల నిర్మాణాలకు ప్రకటన చేశారు. ఈ నేపథ్యంలో సొంత భవనాల్లో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు నిర్వహించే అవకాశం ఉంది.



అద్దె భవనంలో కొనసాగుతున్న వరంగల్ ఆర్వో కార్యాలయం

ఉమ్మడి వరంగల్‌లో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు ప్రభుత్వం చెల్లిస్తున్న అద్దెల వివరాలు (రూ.లలో)

డీఐజీ కార్యాలయం	24,989
వరంగల్ ఆర్వో	84,651
భీమదేవరపల్లి	6,147
నర్సంపేట	24,463
వర్ధన్నపేట	6,550
కొడకండ్ల	3,294
స్టేషన్‌ఘన్‌పూర్	3,754
ములుగు	18,000
జయశంకర్ భూపాలపల్లి	17,004

త్వరలో మంత్రితో సమావేశం..

ఉమ్మడి వరంగల్‌లో అద్దె భవనాల్లో కొనసాగుతున్న సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు శాశ్వత భవనాల నిర్మాణానికి త్వరలో రెవెన్యూ మంత్రితో సమావేశం ఉంది. అనంతరం శాశ్వత భవనాలకు స్థల సేకరణ చేపట్టే అవకాశం ఉంటుంది. తొలుత రంగారెడ్డి, మల్కాజ్‌గిరి, హైదరాబాద్‌లో రిజిస్ట్రేషన్ కార్యాలయాలకు సొంత భవనాల నిర్మాణానికి శ్రీకారం చుట్టేందుకు మంత్రి ప్రకటన చేశారు.

– ఫణీంధర్, జిల్లా రిజిస్ట్రార్

సంక్షిప్తంగా

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం



ఎల్కతుర్తి : రైతు భరోసా, భూమిలేని రైతుకూలీలకు సంవత్సరానికి 12వేలు, కొత్తరేషన్ కార్డుల మంజూరుకు రాష్ట్ర కెబినేట్‌లో ఆమోదం తెలిపిన సందర్భంగా మండల కేంద్రంలోని కాంగ్రెస్ నాయకులు ఆదివారం స్థానిక బస్టాండ్ సమీపంలో సీఎం రేవంత్‌రెడ్డి, రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు ఇంద్రసేనారెడ్డి, సంతాజీ, మంద సుమన్, హింగె శ్రీకాంత్, బక్కి, శనిగరం వెంకటేశ్ పాల్గొన్నారు.

మొగిలిచర్ల సభకు తరలిన కాంగ్రెస్ నాయకులు



ఆత్మకూరు : గీసుకొండ మండలం మొగిలిచర్లలో ఆదివారం డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క రానున్న నేపథ్యంలో మండలంలోని కాంగ్రెస్ శ్రేణులు తరలివెళ్లారు. కమలాపురం రమేశ్, పరికిరాల వాసు, ఏరుకొండ రవీందర్‌గౌడ్, పర్వతగిరి రాజు, బరుపట్ల కిరీటి, తనుగుల సందీప్ పాల్గొన్నారు.

నేడు ప్రమాణస్వీకారం


శాయంపేట : మండల కేంద్రానికి చెందిన మాజీ ఎంపీపీ బాసాని చంద్రప్రకాశ్ తెలంగాణ రాష్ట్ర మినిమం వేజెస్ అడ్వైజరీ బోర్డు మెంబర్‌గా ప్రమాణస్వీకారం చేయనున్నారు. సోమవారం సికింద్రాబాద్‌లోని ఆర్టీసీ క్రాస్ రోడ్డు కార్మిక భవన్‌లో ఆయన ప్రమాణస్వీకారం ఉండనుందని కాంగ్రెస్ నాయకులు తెలిపారు.

పుష్ప నటుడు కేశవకు సన్మానం



పరకాల : పుష్ప సినిమాలో నటించిన చిన్నకోడెపాక గ్రామానికి చెందిన నటుడు కేశవను పరకాల బీఆర్ఎస్ నాయకులు ఆదివారం సన్మానించారు. అల్లు అర్జున్ స్నేహితుడిగా కేశవ నటించి ప్రేక్షకులకు, అభిమానుల మనస్సు దోచుకున్నారని పరకాల ఏఎంసీ చైర్మన్ బండి సారంగపాణి, కుంకుమేశ్వర స్వామి దేవస్థానం మాజీ చైర్మన్ గండె వెంకటేశ్వర్లు కొనియాడారు. భవిష్యత్‌లో నటుడు కేశవ మరిన్ని చిత్రాల్లో నటించి పేరు తీసుకురావాలని కోరారు.

ఆర్థికసాయం అందజేత



ధర్మసాగర్ : మండలంలోని ధర్మపురం గ్రామానికి చెందిన ట్రాక్టర్ డ్రైవర్ లక్కాకుల రాజు నాలుగు రోజుల క్రితం మృతిచెందాడు. ఈ మేరకు గ్రామంలోని ట్రాక్టర్ యూనియన్ డ్రైవర్లు సోమవారం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. రూ.15,000 వేలు ఆర్థికసాయం అందించారు. పరామర్శించిన వారిలో ట్రాక్టర్ డ్రైవర్లు కొత్తపల్లి అశోక్, గై నాగరాజు, గర్దాసు నాగరాజు, బొమ్మినేని లింగారెడ్డి, గర్దాసు కృష్ణ, నేరెళ్ల రవి, చిర్ర సంతోశ్ తదితరులు ఉన్నారు.

నేడు బీఆర్ఎస్ నిరసన దీక్ష

శాయంపేట : కాంగ్రెస్ ప్రభుత్వం రైతు భరోసా పథకం ద్వారా రూ.15వేలు ఇస్తానని ఎన్నికల ప్రచారంలో హామీ ఇచ్చి ప్రస్తుతం రూ.12వేలు ఇస్తామంటూ మాట మార్చడం హేయమైన చర్య అని బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు గంగుల మనోహర్‌రెడ్డి, మాజీ ఎంపీపీ మెతుకు తిరుపతిరెడ్డి విమర్శించారు. సోమవారం మండల కేంద్రంలో నిరసన దీక్ష చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. కార్యకర్తలు, రైతులు తరలిరావాలని పిలుపునిచ్చారు.

'కాంగ్రెస్ హయాంలోనే దళితుల అభివృద్ధి'

వర్ధన్నపేట : కాంగ్రెస్ హయాంలోనే దళితుల అభివృద్ధి జరుగుతుందని దళిత నిరుద్యోగ సంక్షేమ సంఘం (డీఎన్ఎస్ఎస్) రాష్ట్ర అధ్యక్షుడు తుమ్మల కుమారస్వామి తెలిపారు. పట్టణంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. బీఆర్ఎస్ ప్రభుత్వం భూమి లేని పేద దళితులకు మూడెకరాల సాగు భూమి ఇస్తామని హామీ ఇచ్చినా అమలు చేయలేదన్నారు. భూమి లేని దళితులకు భూమి ఇవ్వాలని, భూమి కొనుగోలును ఎకరాకు రూ.40 లక్షలకు పెంచాలని, కులాంతర వివాహితులకు ప్రోత్సాహకాన్ని రూ.5 లక్షలకు పెంచాలని కోరారు. సమావేశంలో నాయకులు సమ్మయ్య, మిథున్, బాబు తదితరులు పాల్గొన్నారు.

కార్యవర్గం ఎన్నిక

ఖానాపురం : మండలంలోని బుధరావుపేటలో కాకతీయ ట్రాక్టర్స్ యూనియన్ కార్యవర్గాన్ని ఆదివారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడుగా చెడిపాక ఉపేందర్, ఉపాధ్యక్షుడుగా సయ్యద్ ఇక్బాల్, కార్యదర్శిగా సంపత్, కోశాధికారిగా యాకాంతం, సలహాదార్లుగా లాల్ సాహెబ్, నర్సయ్య, సుదర్శన్, సభ్యులుగా నర్సయ్య, శుకూర్, శ్రీను, కుమార్, రాజు, కృష్ణ ఎన్నికయ్యారు. అనంతరం అధ్యక్షుడు ఉపేందర్ మాట్లాడారు. ట్రాక్టర్ల ఓనర్ల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు.

మధ్యాహ్న భోజనానికి విరాళం

నంగెం : మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మధ్యాహ్న భోజనం కోసం గీసుకొండ మండలంలోని మరియపురం మాజీ సర్పంచ్ అల్లం బాల్‌రెడ్డి ఆదివారం రూ.10 వేల విరాళం అందించారు. అధ్యాపకులు కళాశాలలో విద్యార్థులకు దాతల సహకారంతో గత డిసెంబర్ 19న మధ్యాహ్న భోజన ఏర్పాటును ప్రారంభించగా బాల్‌రెడ్డి స్పందించి విరాళం అందజేశారు. నగదును కళాశాల అధ్యాపకుడు మామిళ్ల బుచ్చిరెడ్డికి అందజేశారు.

అరెస్ట్, విడుదల

ఖానాపురం : జిల్లాలో డిప్యూటీ సీఎం పర్యటన నేపథ్యంలో మండల కేంద్రానికి చెందిన ఎంఐఎస్ కోఆర్డినేటర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు రావుల రాజేందర్‌ను స్థానిక పోలీసులు ఆదివారం అరెస్ట్ చేశారు. అనంతరం సాయంత్రం విడుదల చేశారు. ఈ సందర్భంగా రాజేందర్ పోలీస్‌స్టేషన్‌లో నిరసన తెలిపారు. అక్రమ అరెస్టులు చేయడం అన్యాయం అన్నారు. పోలీసుల తీరు సరికాదని అసహనం వ్యక్తం చేశారు.

దరఖాస్తుల ఆహ్వానం

ఖానాపురం : మండలంలోని బుధరావుపేట మోడల్ స్కూల్‌లో 6 నుంచి 10వ తరగతుల వరకు ఖాళీగా ఉన్న సీట్ల కోసం అర్హుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ సునీత ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 6 నుంచి ఫిబ్రవరి 28 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేయాలని పేర్కొన్నారు. ఏప్రిల్ 13న ప్రవేశ పరీక్ష ఉంటుందని వివరించారు. అర్హులైన విద్యార్థులు నిర్దేశించిన సమయంలోపు దరఖాస్తులు చేసుకోవాలని ఈ సందర్భంగా ఆమె సూచించారు.

పట్టా భూమిని ఆక్రమించిన వారిపై చర్య తీసుకోవాలి



మాట్లాడుతున్న రమేశ్

వేలేరు : మండలంలోని శాలపల్లి గ్రామానికి చెందిన ఇద్దరు మాజీ మావోయిస్టులు, రెవెన్యూ శాఖకు చెందిన ఓ వీఆర్ఓ కలిసి తమ పట్టా భూమిని ఆక్రమించి, ప్రభుత్వ భూములను తమకు అంటగట్టారని రైతు కూరపాటి రమేశ్ ఆవేదన వ్యక్తం చేశాడు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. కొన్నేళ్ల క్రితం గ్రామానికి చెందిన కొంతమంది కలిసి ఓ వీఆర్ఓ అండదండలతో తమ పట్టా భూములను అక్రమంగా పట్టా చేసుకుని ప్రభుత్వం పేదలకు ఇచ్చిన భూములను తమ పేరున పట్టా మార్పిడి చేశారని ఆరోపించారు.

అర్హులైన ప్రతిఒక్కరికీ ఇందిరమ్మ ఇల్లు

- ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి



భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే ప్రకాశ్‌రెడ్డి

దామెర : అర్హులైన ప్రతిఒక్కరికీ ఇందిమ్మ ఇల్లు మంజూరు చేస్తామని ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలో ఆదివారం మోడల్ ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిలువనీడలేని నిరుపేదల కోసం రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్లు నిర్మించి ఇవ్వనుందని అన్నారు. లబ్ధిదారులు ఎలాంటి అపోహలకు గురికావొద్దని, పేదల సంక్షేమం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తుందని అన్నారు. నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యంగా ముందుకెళ్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ జ్యోతివరలక్ష్మీదేవి, ఎంపీడీఓ శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీఓ రంగాచారి, కాంగ్రెస్ జిల్లా నాయకులు బిల్లా రమణారెడ్డి, నాయకులు అనిల్ రెడ్డి, భిక్షపతి, పోషయ్య, యూత్ నాయకులు రవికుమార్, రతన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

హెల్మెట్ ధరించి వాహనాలు నడపాలి

- ఎస్సై జక్కుల పరమేశ్



మాట్లాడుతున్న ఎస్సై పరమేశ్

శాయంపేట : ద్విచక్రవాహనాదారులు హెల్మెట్ ధరించి వాహనాలు నడపాలని ఎస్సై జక్కుల పరమేశ్ సూచించారు. మండలంలోని మాందారిపేట స్టేజీ వద్ద ఆదివారం వాహనదారులకు, ప్రయాణికులకు రోడ్డు ప్రమాదాల నివారణపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ.. ప్రతీఒక్క వాహనదారుడు అతివేగంగా వెళ్లకుండా హెల్మెట్ ధరించి నెమ్మదిగా వెళ్లాలన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలకు వాహనాలు ఇవ్వొద్దని అన్నారు. డ్రంకెన్‌డ్రైవ్, ట్రిపుల్ రైడింగ్‌కు పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు.

చైనా మాంజాకు నో చెప్పండి

సంక్రాతి పండుగా సందర్భంగా ఆనవాయితీగా ఎగురవేసే గాలి పటాలకు ప్రమాదకరంగా మారిన చైనా మాంజాను వినియోగించకుండా కాటన్ దారాన్ని వాడాలని ఎస్సై జక్కుల పరమేశ్ సూచించారు. మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌లో ఆదివారం ఆయన మాట్లాడారు. సంక్రాతి పండుగ పర్వదినాన్ని పురస్కరించుకుని చిన్నారులు, యువతి, యువకులు ఎగురవేసే గాలిపటాలకు చైనా మాంజాను వినియోగించొద్దని కోరారు. మండల కేంద్రం, వివిధ గ్రామాల్లోని కిరాణాల్లో చైనా మాంజాను విక్రయిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పట్టణాల నుంచి గ్రామాలకు వచ్చే చిన్నారులు బంగ్లాపై గాలిపటాలను ఎగరవేయకుండా తల్లిదండ్రులు జాగ్రత్త పడాలని అన్నారు. పండుగను సంతోషంగా జరుపుకోవాలని కోరారు.

రథయాత్రను జయప్రదం చేయండి



మాట్లాడుతున్న బండారి సురేందర్

ధర్మసాగర్ : వెయ్యి గొంతులు, లక్ష డప్పుల రథయాత్రను జయప్రదం చేయాలని ఎమ్మెస్పీ జిల్లా అధ్యక్షుడు బండారి సురేందర్ మాదిగ, జిల్లా అధికార ప్రతినిధి గంగారపు శ్రీనివాస్ పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో ఆదివారం ఎమ్మార్పీఎస్ మండల సమావేశంలో పాల్గొని మాట్లాడారు. సుప్రీం కోర్టు తీర్పును అనుసరిస్తూ తెలంగాణ రాష్ట్రంలో రేవంత్‌రెడ్డి సర్కార్ ఎస్సీ వర్గీకరణ అమలు చేయాలని కోరుతూ ఫిబ్రవరి 07న వెయ్యి గొంతులు, లక్ష డప్పులతో మాదిగ, మాదిగ ఉపకులాల మహా ప్రదర్శన చేపట్టనున్నట్లు తెలిపారు. ఎమ్మార్పీఎస్ ఉద్యమం న్యాయమైన ఉద్యమం అని, మొదటి నుంచి అన్ని వర్గాలు, సంఘాలు, రాజకీయ పార్టీల మద్దతు కలిగిన ఏకైక ఉద్యమమని అన్నారు. ఈ మహా ప్రదర్శనకు అన్ని వర్గాల కవులు, కళాకారులు తరలివస్తున్నారని ప్రతి మాదిగ, ఉద్యమ మద్దతుదారులు డప్పు కొనాలని అన్నారు. ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు అన్వేష్, జిల్లా ప్రధానకార్యదర్శి శాంతిసాగర్, ప్రశాంత్, మనోజ్, శంశోద్దీన్, బాబు, రాజు పాల్గొన్నారు.

శబరిమలకు బయలుదేరిన స్వాములు



ఇరుముడి వేసుకొని శబరిమల వెళ్తున్న అయ్యప్ప మాలధారులు

శాయంపేట : మండల కేంద్రంలోని అయ్యప్ప మాలధారులు ఆదివారం మండల కేంద్రంలోని మత్స్యగిరి స్వామి ఆలయంలో ఇరుముడి వేసుకొని శబరిమల యాత్రకు బయలుదేరారు. 41 రోజుల పాటు దీక్ష చేసిన స్వాములు అయ్యప్ప శరణుఘోష నడుమ గురుస్వామి రావర్ల ప్రకాశ్ అయ్యప్ప స్వాములకు ఇరుముడి కట్టారు. అనంతరం మండల కేంద్రంలోని వంగల పరమేశ్వర్ ఇంట్లో శబరిమలకు వెళ్తున్న అయ్యప్ప స్వాములకు అన్నదానం చేశారు. అయ్యప్ప నామస్మరణతో వీధులు మార్మోగాయి. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ సామల భిక్షపతి, గురుస్వాములు దిడ్డి రమేశ్, బొల్లపల్లి సదానందం, సతీశ్, వినుకొండ రాజ్‌కుమార్, గట్టు కిషన్, గోరంటల ప్రశాంత్, వనం విశాల్, మోతుకూరి ఉమాశంకర్, శ్రీకాంత్, హరిబాబుతో పాటు అయ్యప్ప మాలధారులు తదితరులు పాల్గొన్నారు.

రాజకీయ లబ్ధికోసమే విమర్శలు

శాయంపేట : మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి రాజకీయ లబ్ధి కోసం రైతుభరోసాపై విమర్శలు చేస్తున్నారని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు దూదిపాల బుచ్చిరెడ్డి విమర్శించారు. మండల కేంద్రలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. రెండు పర్యాయాలు శాసనసభ్యుడిగా, సుదీర్ఘకాలం రాజకీయాల్లో ఉన్న మాజీ ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి వ్యాఖ్యలు రైతులను అయోమయానికి గురి చేసేలా ఉన్నాయని అన్నారు. రైతు భరోసా పథకంపై విధివిధానాలను మంత్రి మండలి ఖరారు చేస్తుండగా.. రైతులను తప్పుదోవ పట్టించే విధంగా మాట్లాడడం సరికాదన్నారు. గత ప్రభుత్వం సాగుకు యోగ్యం కాని భూములకు రైతుబంధు ఇచ్చి ప్రజాధనాన్ని దుర్వినియోగం చేసిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం సాగు చేసే రైతుకు రైతు భరోసా అందించాలని నిర్ణయం తీసుకుంటే విమర్శలు చేయడం తగదన్నారు. ప్రజలను తప్పుదోవ పట్టించే కుట్రను మానుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.